## కంటైన్మెంట్‌లోకి 'తక్కళ్లపల్లి'

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని తక్కళ్లపల్లిలో ఓ వృద్ధునికి కరోనా పాజిటివ్ వచ్చిన నేపథ్యంలో గ్రామాన్ని అధికారులు కంటైన్మెంట్ జోన్‌గా ప్రకటించారు. దీంతోపాటు మ్యాడంపల్లి, మానాల, లంబాడిపల్లి గ్రామాలను కూడా పోలీసులు కంటైన్‌మెంట్ జోన్ కింద పరిగణించి ఆధీనంలోకి తీసుకున్నారు. ఆ గ్రామాల్లో ఇండ్ల నుంచి ఎవరూ బయటికి రావొద్దని అధికారులు సూచించారు. సోమవారం ఉదయం ఆర్డీవో నరేందర్, రెవెన్యూ అధికారులు తక్కళ్లపల్లి గ్రామంలో పర్యటించారు. అనంతరం మల్యాల పీహెచ్‌సీ వైద్యాధికారి లావణ్య ఆధ్వర్యంలో వివిధ మండలాల నుంచి వచ్చిన ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ఆరోగ్య సర్వే చేశారు. ఆ వృద్ధుడు ఎవరెవరిని కలిశాడో వివరాలు నమోదు చేసుకున్నారు. క్వారంటైన్‌కు తరలించిన కుటుంబ సభ్యుల పరీక్షల రిపోర్టులు రాగానే, పరిస్థితిని బట్టి గ్రామస్తులందరికీ వైద్య పరీక్షలు చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గ్రామంలో పర్యటించారు. చేతులెత్తి నమస్కరించి మొక్కుతున్నా.. ఎవరూ బయటికి రావొద్దని కోరారు. ఎమ్మెల్యే వెంట సీఐ కోరే కిషోర్, ఎస్ఐ ఉపేంద్రచారి, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీఓ సుధాకర్, డాక్టర్ లావణ్య తదితరులు ఉన్నారు.

## వ్యాక్సిన్ వచ్చేవరకూ జాగ్రత్తలు తప్పవు

- రవాణాశాఖమంత్రి పువ్వాడ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరోనా వైరస్ వ్యాప్తి నిరోధానికి వ్యాక్సిన్ వచ్చే వరకు జాగ్రత్తలు తప్పవని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. దీనిపై ప్రజలు అవగాహనతో, అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సోమవారం ఆయన ఖైరతాబాద్‌లోని రవాణాశాఖ కార్యాలయంలో ప్రభుత్వ డ్రైవర్లు, చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బందికి శానిటైజర్లు, మాస్కులు, గ్లౌజులు, సబ్బులతో కూడిన రూ. ఐదువేల కిట్లను అందచేశారు. లాక్‌డౌన్ వల్లే కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టగలుగుతున్నామనీ, లేకుంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చేదనీ అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రవాణాశాఖ కమిషనర్ ఎమ్ఆర్ఎమ్ రావు మాట్లాడుతూ కరోనా నివారణ కోసం ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. రవాణాశాఖ జాయింట్ కమిషనర్లు రమేష్, మమతా ప్రసాద్, ఓఎస్డీ కృష్ణకాంత్, పీఎస్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కార్మికులకు బిఒబి సాయం

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

కరోనాతో వలస కార్మికులు ఎదుర్కొంటున్న ఆకలిని దృష్టిలో పెట్టుకుని బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) ఆపన్నహస్తం అందించింది. హైదరాబాద్‌లోని మాదాపూర్, హైటెక్ సిటీ, లింగంపల్లి ప్రాంతాల్లో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షెల్టర్ హోమ్‌లలో ఉన్న వంద మంది వలస కార్మికులకు సోమవారం రూ.90 వేల విలువ చేసే తొమ్మిది రకాల నిత్యావసర సరుకులను అందించారు. వారి సహాయానికి కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ రీజినల్ ఆఫీస్ హెడ్ కె.విజయ రాజు, డిప్యూటీ మేనేజర్ టీవీఎస్ శర్మ, చందానగర్ బ్యాచ్ చీఫ్ మేనేజర్ అనురాధ శ్రీపాద తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ టీచర్ల రిజర్వేషన్లపై ఏం చేద్దాం..

- నేడు క్యాబినెట్‌లో సీఎం సమీక్ష
- సుప్రీం తీర్పు నేపథ్యంలో ఉన్నతస్థాయి సమావేశం
- రివ్యూ పిటిషన్ దిశగా అడుగులు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏజెన్సీ రిజర్వేషన్ల వ్యవహారంపై సీఎం కేసీఆర్ దృష్టి సారించారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోని గిరిజన ప్రాంతంలో ఉపాధ్యాయుల నియామకాల్లో 100 శాతం రిజర్వేషన్ల అమలు జీవోను సుప్రీం కోర్టు ఇటీవల కొట్టివేసిన నేపథ్యంలో ఈ అంశంపై పూర్తి స్థాయిలో చర్చించి తదుపరి కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని కొందరు ఉన్నతాధికారులతో సీఎం చెప్పినట్టు అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఈ అంశంపై మంగళవారం ప్రగతి భవన్‌లో ఆయన ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తారని గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు సమాచారం అందింది. అదే రోజున జరిగే మంత్రివర్గ సమావేశంలో ఈ అంశాన్ని చర్చిస్తారా లేక విడిగా చర్చిస్తారా అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. సుప్రీం తీర్పు తర్వాత గిరిజనసంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఆ శాఖ కార్యదర్శి, కమిషనర్ క్రిష్టినా జెడ్ చోంగ్తులతో రెండుసార్లు సమావేశమై న్యాయపరమైన అంశాల గురించి చర్చించారు. జీవో నంబర్ 3ను సుప్రీం కోర్టు కొట్టివేయటంతో ఇటువంటి నియామకాలకు సంబంధించి గతంలో సాంఘిక సంక్షేమ శాఖ జారీ చేసిన 32 ఇతర జీవోలపై కూడా ప్రభావం పడుతుందనీ, తదుపరి నియామకాలపై ప్రతిష్ఠంభన ఏర్పడుతుందని కొందరు అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. మరో వైపు జిఒ 3 కొనసాగేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంఘాలు ఉద్యమ బాట పట్టిన నేపథ్యంలో ముఖ్యమంత్రితో చర్చించాలని నిర్ణయించిన మంత్రి సత్యవతి రెండ్రోజుల క్రితం ఆయన ఇంటర్వ్యూ కోరారు. ఈ నెల 5న ఈ అంశంపై చర్చించటానికి సీఎం అంగీకరించారని సిఎంఒ కార్యాలయం నుంచి మంత్రికి సమాచారం అందింది.

**రివ్యూ పిటిషన్‌పై న్యాయ సలహా...**

సుప్రీం తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాలని ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించిన అధికారులు సిఎం ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు. సుప్రీం తీర్పుతో ఆదివాసీ నిరుద్యోగులు తీవ్రంగా నష్ట పోతారని పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఇటీవల సిఎం దృష్టికి తెచ్చారు. సుప్రీం తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాలని ఏపీ ప్రభుత్వం కూడా నిర్ణయించిన విషయాన్ని కొందరు ఉన్నతాధికారులు సిఎంకు చెప్పారు. రివ్యూ పిటిషన్‌లో పొందుపరచాల్సిన అంశాలపై గిరిజన సంక్షేమ శాఖ అధికారులు రాష్ట్ర అదనపు అడ్వకేట్ జనరల్ రామచంద్రరావుతో ఇప్పటికే మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం తరపున సుప్రీం కోర్టులో వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది రాజీవ్ ధావన్‌తో కూడా అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. మంగళవారం ముఖ్యమంత్రి నిర్వహించే సమావేశానికి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఆ శాఖ కార్యదర్శితోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, అడ్వకేట్ జనరల్, అదనపు అడ్వకేట్ జనరల్ తదితరరులు హాజరు కానున్నారు.

# మొరాయిస్తున్న ఇ-పాస్ వెబ్‌సైట్

- లక్షకు పైగా దరఖాస్తులు
- ఏడు వేలు మాత్రమే జారీ



ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో చిక్కుకున్న ఇతర రాష్ట్రాలకు చెందిన వారి కోసం ఉద్దేశించిన పోలీస్ ఇ-పాస్ వెబ్‌సైట్ సాంకేతికంగా మొరాయించడంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరోనా వైరస్ వ్యాప్తి నిరోధానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాక్‌డౌన్ ప్రకటించడంతో రాష్ట్రంలో వేలాది మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారితో పాటు వివిధ జిల్లాలకు చెందిన వారు హైదరాబాద్‌లో చిక్కుకున్నారు. తమ సొంత ఖర్చులతో తిరిగి స్వస్థలాలకు చేరుకునే వారికి పాస్‌లను జారీ చేయాలని పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ మేరకు రెండ్రోజుల క్రితం తెలంగాణ పోలీసు వెబ్‌సైట్‌లో 'టిఎస్‌పి.కోవిడ్. ఇన్-ఈ పాస్' పేరిట సైట్‌ను ఓపెన్ చేశారు. ఇందులో అత్యవసర సేవలు, లాక్‌డౌన్ ఇంటర్ డిస్ట్రిక్ట్, లాక్‌డౌన్ ఇంటర్ స్టేట్ పేరిట మూడు ఆప్షన్‌లను ఇచ్చిన అధికారులు సంబంధితులు ఆయా కేటగిరీల కింద ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తమ వివరాలను ఇవ్వడంతో పాటు ఏ కారణం చేత తామిక్కడ ఉంటున్నాము..? ఎందుకు తిరిగి వెళ్లదలుచుకున్నారు..? తదితర వివరాలతో అందుకు సంబంధించిన ఆధారాలనూ ఈ దరఖాస్తులో పొందుపరిచేలా సూచించారు. అంతేగాక ప్రతి రోజు కుటుంబంలోని ఒక్కరికి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలనే నిబంధనలు విధించారు.దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను స్థానిక పోలీసులు పరిశీలించి అందులో వాస్తవాలను తెలియచేశాకే సంబంధితులకు పాస్‌లను జారీ చేస్తున్నారు. డిజిపి కార్యాలయం నుంచి ఈ ప్రక్రియ మొదలు కాక ముందు ఆయా జిల్లాల ఎస్‌పిలు, నగర సిపిలు, జోన్ డిసిపిలు పాస్‌లను దరఖాస్తు చేసుకున్న వారి అత్యవసరాలను బట్టి జారీ చేసేవారు. ఇదిలా ఉంటే డిజిపి కార్యాలయం నుంచి ఈ- పాస్‌ల సమాచారం రాగానే అనేక మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారితో పాటు, వివిధ జిల్లాలకు చెందిన వారు ఆన్‌లైన్ దరఖాస్తులతో పోటెత్తారు. ఈ మేరకు ఆన్‌లైన్‌లో లక్షకు పైగా దరఖాస్తులు వచ్చినట్టు తెలుస్తున్నది. ఇందులో ఏడు వేల పాస్‌లు మాత్రమే వెరిఫికేషన్ చేసి జారీ చేశారనీ, మిగతా వాటికి ఇంకా జారీ కాలేదని సమాచారం. అంతేగాక మరి కొందరు దరఖాస్తు చేసుకుందామన్నా సంబంధిత సైట్ స్వీకరించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. రోజుకు ఒకరి చొప్పున పాస్‌లు ఇవ్వడం అనేది తమకు ఇబ్బంది అయినా దరఖాస్తు చేసుకుంటున్నామనీ, కాని అవి కూడా జారీ కాకపోవడంతో తాము ఇక్కడ నానా ఇబ్బందులకు గురి అవుతున్నామని ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తన చెల్లిలి ఇంట్లో పెండ్లికి వచ్చి దాదాపు నెలన్నరగా అరవై మందికి పైగా బంధువులు, కుటుంబసభ్యులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నామనీ, తాము ఇండోర్‌కు వెళ్లేందుకు పాస్‌లు ఇచ్చి సహకరించాలని మిశ్రా అనే ఉపాధ్యాయుడు పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేశాడు. ఈ విధంగా జీడిమెట్ల, కూకట్‌పల్లి, శంషాబాద్, పీర్జాదిగూడ తదితర ప్రాంతాలలో వందలాది మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారు చిక్కుబడిపోయి నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తమకు పాస్‌లు ఇస్తే సొంత ఖర్చులతో ఏదో విధంగా తమ స్వస్థలాలకు వెళ్లి పోతామనీ, వారు వేడుకుంటున్నారు. కాగా ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన వారిని వారి స్వస్థలాలకు పంపించడానికి తమ శాయాశక్తులా కృషి చేస్తున్నామనీ, ఈ ప్రక్రియలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని అయినప్పటికీ సమస్యలను పరిష్కరిస్తామని పోలీసు అధికారులు చెబుతున్నారు.

## పంపిస్తే పనులెట్లా!

- రంగంలోకి దిగిన కలెక్టర్లు, పోలీస్ అధికారులు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

లాక్‌డౌన్ నేపథ్యంలో చిక్కుకుపోయిన వలస కూలీలను సొంతూళ్లకు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలివ్వడంతో వేలాది మంది కార్మికులు రోడ్డెక్కారు. తమన తమ తమ స్వస్థలాకు పంపించాలని ఆందోళన బాట పట్టారు. పరిస్థితి చేయిదాటుతున్న తరుణంలో వలస కార్మికులను సొంతూళ్లకు పంపకూడదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిసింది. కార్మికులు వెళితే ప్రాజెక్టులు అస్తవ్యస్త మవుతాయి. పారిశ్రామిక రంగం, నిర్మాణరంగం కుప్పకూలే ప్రమాదముందని గ్రహించిన సర్కార్ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఎక్కడికక్కడ జిల్లా కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికా రులు రంగంలోకి దిగి సాధ్యమైనంత వరకు వెళ్లకుండా చూడాలని అంతర్గ తంగా ఆదేశాలు ఇచ్చింది. వలస కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి ఎక్కడివారక్కడే ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లు సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదివారం ఎన్టీపీసీ జ్యోతిభవన్లో అందుబాటులో ఉన్న అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు.' వెంటనే ఎన్టీపీసీ పనులను ప్రారంభించండి.. అందులో పనిచేసే వలస కార్మికులు స్వస్థలాలకు పోకుండా ఆపండి.. వారికి కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించండి.. ఒక్క సారీ వారు సొంతూళ్లకు వెళితే ఇప్పట్లో రారు. వారికి మనో ధైర్యం కల్పించేలా చర్యలు తీసుకోండి..' అని అధికారులను ఆదేశించారు. ఇందులో రామగుండం పోలీస్ కమిషనర్ సత్యనారాయణ, ఇతర అధికారులతో పాటు స్థానిక శాసన సభ్యులు కోరుకంటి చందర్ సైతం ఉన్నారు.

# కూలి 60 రూపాయ లేనా..?

- ఎర్రటెండలో పనిచేస్తే ఇచ్చేది గిదా..
- గూడూరు గ్రామస్తుల ఆందోళన
- పనులు కల్పించాలని ఎడపల్లి 'ఉపాధి' కూలీల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నలభై రోజులుగా ఎలాంటి పనీ లేదు.. కుటుంబాలు గడవడానికి తిప్పలు పడుతున్నం.. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో నాలుగు మెతుకుల కోసం ఎర్రటెండలో ఉపాధి హామీ పనిచేస్తే రూ.60 కూలి చెల్లిస్తున్నారు. కొన్నిచోట్ల అసలు పనులే చూపడం లేదంటూ.. మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో సోమవారం ఉపాధి హామీ కూలీలు నిరసన తెలిపారు.

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గూడూరు గ్రామానికి చెందిన 200 మంది ఉపాధి హామీ కూలీలు కూలి తక్కువ ఇస్తున్నారంటూ ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా కూలీలు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్రహ్మసముద్రం, ఎర్ర చెరువులో రెండు వారాలు పనిచేస్తే 60, 70, 80 రూపాయల కూలి చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేతులకు బొబ్బలు వచ్చేటట్టు తవ్వుతున్నా కూలి చెల్లింపులో అధికారులు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ ఉపాధి కూలీలతో మాట్లాడారు. అధికారులతో కలసి పని ప్రదేశానికి వచ్చి మళ్లీ కొలతలు తీయించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ ఎదుట కూలీలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. గ్రామంలో సుమారు 500 గ్రూపులున్నాయనీ, వారందరికీ జాబ్‌కార్డులున్నాయన్నారు. కానీ, 7 గ్రూపులతోనే పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. తమకు పని చూపాలని రెండు వారాలుగా కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎడపల్లి ఎంపీడీవో శంకర్ అక్కడికి వచ్చి కూలీలతో మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం వల్ల సీనియర్ మేట్‌కు ఉపాధి పనుల బాధ్యత అప్పగించామని, అందువల్ల కొంత ఆలస్యం అయిందని, జాబ్ కార్డులున్నవారందరికీ పని కల్పిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.



నల్గొండ జిల్లా వీర్లపాలెంలో థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద నిరసన తెలుపుతున్న వలస కార్మికులు

## సొంతూళ్లకు పోతం

### యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ కూలీల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'మా ఊర్లకు మేం పోతం.. అనుమతివ్వండి' అంటూ నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద ఉన్న యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో పని చేస్తున్న వలస కూలీలు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు మాట్లాడుతూ థర్మల్ విద్యుత్ కేంద్రంలో పలువురు కాంట్రాక్టర్ల వద్ద ఒడిశా, బీహార్, రాజస్థాన్ ప్రాంతాలకు చెందిన వందల సంఖ్యలో కూలీలు పని చేస్తున్నారని తెలిపారు. లాక్‌డౌన్‌తో సొంతూర్లకు వెళ్లలేక తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఇక్కడ బయటికి కూడా వెళ్లలేక పోతున్నామని తెలిపారు. తమను సొంత గ్రామాలకు పంపించాలని అధికారులను వేడుకున్నారు. దరఖాస్తు చేసుకుంటే కలెక్టర్ ద్వారా అనుమతి తీసుకొని స్వగ్రామాలకు పంపే ఏర్పాట్లు చేస్తామని విద్యుత్ కేంద్రం అధికారులు హామీ ఇవ్వడంతో కూలీలు ఆందోళన విరమించారు. విషయం తెలుసుకున్న ఆదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ప్లాంట్ వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు.

## ధాన్యం తూకాల్లో మోసం

- దిగుబడికి తగ్గట్టుగా సేకరణలో నిర్లక్ష్యం
- సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు
- మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల్లో పర్యటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం తూకాల్లో రైతులను మోసం చేస్తున్నారని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. పంట దిగుబడికి తగ్గట్టుగా రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. సోమవారం ఆయన రంగారెడ్డి జిల్లా సీపీఐ(ఎం) నాయకులతో కలిసి ఇబ్రహీంపట్నం, మంచాల మండలాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కొనుగోళ్లపై రైతులను వివరాలడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా చెరుపల్లి మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా పంటల దిగుబడి పెరిగిందని ప్రభుత్వమే చెబుతోందని, ఆ మేరకు ధాన్యం సేకరణ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం తూకాల్లోనూ మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్వింటాలుకు 3నుంచి 5 కేజీల ధాన్యం తరుగు తీస్తున్నారన్నారు. 90శాతం వరి పండించే గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా.. 10శాతం మాత్రమే వరి సాగు ఉండే గ్రామాల్లో కేంద్రాలను ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. వెంటనే నోముల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని లోయపల్లి, బోడకొండ, ఆరుట్ల ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. హమాలీకి రైతుల నుంచి కాకుండా ప్రభుత్వమే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో సాగునీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గతంలో ఇబ్రహీంపట్నం చెరువును నింపుతామని ప్రభుత్వం చెప్పిందని గుర్తు చేశారు. చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టు ద్వారా చెరువులు, కుంటలను నింపాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పార్టీ జిల్లా కార్యదర్శి దుబ్బాక రాంచందర్, మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.సామేల్, పి.యాదయ్య, ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ ఉన్నారు.

## వడదెబ్బతో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం సాలూరలో సోమవారం వడదెబ్బతో వృద్ధుడు మృతిచెందాడు. కొన్నేండ్ల కిందట మహారాష్ట్ర నుంచి వచ్చిన వృద్ధుడు(65) స్థానిక మంజీరా శివాలయంలో పూజారిగా పనిచేశాడు. వృద్ధాప్యంతో స్థానిక బస్టాండ్‌లో ఉంటున్నాడు. పెరిగిన ఎండ తీవ్రతకు తట్టుకోలేక సోమవారం మృతిచెందాడు. గ్రామస్తులు చందాలు వేసుకొని అంత్యక్రియలు నిర్వహించారు.

# పేద, మధ్య తరగతులకు సిపిఎం అండ

- రూ.కోటి విలువైన సరుకుల పంపిణీ
- ఖమ్మం జిల్లాలో 40 రోజులుగా సాయం
- ఆదర్శ కేంద్రాలుగా తూటికుంట్ల, తెల్దారుపల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొన్ని త్యాగాలకు వేలిచ్చినా వెలకట్టలేం.. కొందరి ఆదర్శాలను కోట్లిచ్చినా కొనలేం.. కానీ, క్లిష్టపరిస్థితుల్లో ఆకలితో మాడుతున్న కడుపులను చూసి అన్నం ముద్దలా మారిపోతామని సిపిఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ రుజువుచేసింది. కరోనా నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు 40 రోజులుగా సుమారు కోటి రూపాయలకుపైగా విలువైన నిత్యావసర సరుకులను పంపిణీ చేసింది. ఎలాంటి ప్రచారార్భాటం లేకుండా జిల్లావ్యాప్తంగా వలస కూలీలు, పేదలకు జిల్లా కమిటీ అందిస్తున్న సేవలపై ప్రశంసల జల్లు కురుస్తున్నది.

మార్చి 22న జనతా కర్ఫ్యూ నుంచి జిల్లాలోని 21మండలాల్లో సుమారు 44,570 మంది వలస కూలీలు, మరో 50వేల కర్షకులు, దినసరి కూలీలకు, పారిశుధ్య కార్మికులకు సేవలందుతూనే ఉన్నాయి. జిల్లా కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మార్చి నెలాఖరు నుంచి నేటిదాకా జిల్లాలో సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో వేలాది మందికి బియ్యం, కూరగాయలు, సరుకులు, భోజన ఏర్పాట్లు, మాస్కులు, శానిటైజర్లు, సబ్బులు పంపిణీ చేస్తున్నారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న నిత్యావసర వస్తువుల పంపిణీ తరహాలో ఇక్కడ సుమారు 14రకాల నిత్యావసరాలను పంపిణీ చేస్తుండటంతో పేదలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఆదర్శ కేంద్రాలుగా తూటికుంట్ల, తెల్దారుపల్లి..**

తెల్దారుపల్లి, బోనకల్ మండలం తూటికుంట్ల గ్రామంలో 40రోజులుగా నిత్యావసర వస్తువుల పంపిణీ కొనసాగుతూనే ఉంది. తూటికుంట్లలో సిపిఐ(ఎం) మధిర డివిజన్ నాయకులు పాపినేని రామనర్సయ్య, ఎంపిపి, సర్పంచ్, ఎంపిటిసి, మాజీ ఎంపిటిసి, తదితరుల ఆధ్వర్యంలో 25టన్నుల కూరగాయలు, పుచ్చకాయలు, అతితక్కువ ధరకు ప్రజలకు అందించారు. తెల్దారుపల్లిలో గ్రామ సర్పంచ్ సిద్ధినేని కోటయ్య, తమ్మినేని కోటేశ్వరరావు, ఆంధ్రా బ్యాంకు కర్షకసేవా సమితి వైస్ చైర్మెన్ తమ్మినేని విజయ, జాలాదిసంగయ్య, ఎల్లంపల్లి యాదగిరి, నాగయ్య తదితరుల ఆధ్వర్యంలో 45టన్నుల కూరగాయలు హోల్‌సేల్ రేటుకన్నా తక్కువగా నిరంతర పంపిణీ కొనసాగుతున్నది.

**లాక్‌డౌన్ ముగిసేదాకా అందిస్తాం :**
**నున్నా నాగేశ్వరరావు (సిపిఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి)**

జిల్లాలో పేద, మధ్యతరగతి, వలసకూలీలకు, తలసేమియా బాధిత చిన్నారులకు అండగా ఉండాలని తీర్మానించి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించింది. 40 రోజులుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి నిత్యావసరాలు అందిస్తూ అండగా ఉంటున్నాం. లాక్‌డౌన్ పూర్తిగా సడలించేంత వరకూ నిత్యావసరాల సరఫరా కొనసాగుతోంది.

**సరుకుల విలువ వివరాలు**

| వస్తువులు | కేంద్రాలు | కుటుంబాలు | విలువ (రూ.లలో) |
|---|---|---|---|
| బియ్యం | 194 | 18,795 | 15,18,190 |
| కూరగాయలు | 189 | 26,780 | 11,80,800 |
| సరుకులు | 81 | 9,120 | 32,29,300 |
| భోజన ఏర్పాట్లు | 28 | 10,040 | 15,65,000 |
| మాస్కులు | 95 | 19,447 | 5,83,410 |
| శానిటైజర్లు | 40 | 6,905 | 8,63,125 |
| సబ్బులు | 49 | 2,232 | 22,320 |

# లాక్‌డౌన్ నిబంధనలు బేఖాతరు

- స్లమ్ ఏరియాలో గుంపులు గుంపులుగా ఆకతాయిలు
- భౌతిక దూరాన్ని మరిచి పేకాట, అష్టాచమ్మ ఆటలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచవ్యాప్తంగా కరోనా మహమ్మారి విలయ తాండవం చేస్తోంది. ముఖ్యంగా మన రాష్ట్రంలో రోజురోజుకు కేసుల సంఖ్య విపరీతంగా పెరుగుతుండటంతో దీన్ని నివారించే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాక్‌డౌన్ అనే ఆయుధాన్ని ప్రయోగించాయి. కరోనాను కట్టడి చేసేందుకు రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలను రెడ్‌జోన్‌లుగా నిర్ణయించారు. దీని నివారణకు ప్రభుత్వం ఇంతలా కృషి చేస్తుంటే ముషీరాబాద్ నియోజకవర్గంలో లాక్‌డౌన్ ప్రభావం మాత్రం ఎక్కువగా కనిపించడం లేదు. ఈ ప్రాంతంలో దాదాపు 10 కేసులు నమోదయ్యాయి. ముషీరాబాద్ రాంనగర్, విద్యానగర్, రాంనగర్‌గుండు ప్రాంతాల్లో ప్రజలు భయానక వాతావరణ ంలో జీవిస్తున్నారు. నియోజకవర్గంలో పోలీసులు లాక్‌డౌన్‌ను దష్టిలో ఉంచుకుని రహదారులను ఎక్కడికక్కడ మూసి వేస్తున్నారు. పోలీసులు నిరంతరం ప్రజా ప్రయోజనాలను దష్టిలో ఉంచుకొని రోడ్డుపైకి అనవసరంగా వచ్చిన వారిని ఎక్కడికక్కడ నిరోధిస్తూ వారి వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నారు. ఇంత విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజలు పోలీసులకు, రాష్ట్ర ప్రభుత్వానికి అండగా ఉంటూ లాక్‌డౌన్ పకడ్బందీగా నిర్వహించడానికి తమ వంతుగా కషి చేస్తూ స్వయం నిర్బంధంలో ఉండాల్సింది పోయి లాక్‌డౌన్ సెలవుల్లో కుటుంబ సభ్యులతో సమయం పంచుకోవాల్సిది మాని విచ్చలవిడిగా, మూకుమ్మడిగా రోడ్లపైకి వస్తున్నారు. ముఖ్యంగా బస్తీలో నివసించేవారు ముషీరాబాద్ నియోజకవర్గంలో స్లమ్ ఏరియాలో, ముషీరాబాద్, రాంనగర్, మేదర్‌బస్తీ, కవాడిగూడ, మాడీబయి బస్తీ, నాగయ్యకుంట తదితర బస్తీలో పోకిరీలు, ఆకతాయిలు నియమాలను పాటించకుండా గుంపులు గుంపులుగా చేరుతున్నారు. అష్టాచమ్మ, పేకాట ఆటలాడుతూ రోడ్లపై, బస్తీలో అరుగులపై కూర్చొని బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మి వేస్తూ కరోనా వైరస్ వ్యాప్తికి కారకులవుతున్నారు.

**భౌతిక దూరం పాటించకపోవడం వల్ల ఎంత అనర్థం**

మొన్నటికి మొన్న ఒక ముసలావిడ భౌతిక దూరం పాటించకుండా అష్టాచమ్మా ఆడుతూ 30 మందికి కరోనా వైరస్ అంటించింది. అదేవిధంగా కొందరు వ్యక్తులు పేకాట ఆడుతూ 20 మందికి పైగా వైరస్ వ్యాపింపజేశారు. ఇంత జరుగుతున్నా ప్రజలకు అవగాహన రాలేదు కదా ఇంకా ఎక్కువగా గుమిగూడుతూ బస్తీలో ఆటలు ఆడుతున్నారు. ఇంత జరుగుతున్నా ముషీరాబాద్, గాంధీనగర్, చిక్కడపల్లి, నల్లకుంట పోలీసు సిబ్బంది బస్తీ ప్రజలకు అవగాహన కల్పిస్తూ లాక్‌డౌన్‌ను కట్టుదిట్టంగా అమలు చేయడంలో విఫలమయ్యారని చెప్పాలి. ప్రజలకు కరోనా విపత్కర పరిస్థితులపై అవగాహన కల్పించాల్సిన నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రజా ప్రతినిధులు నాయకులు స్వయానా భౌతిక దూరాన్ని పాటించకుండా లాక్‌డౌన్ నిబంధనలను విస్మరిస్తున్నారు. పేదలు నివసించే బస్తీలో గట్టి నిఘా ఏర్పాటు చేసి పెట్రోలింగ్ సిబ్బందితో బస్తీలలో గుంపులు గుంపులుగా ఉంటున్నా ఆకతాయిల ఆట కట్టించాల్సిన పోలీసులు కేవలం రోడ్ల పైకి వచ్చేవారిని నిరోధిస్తున్నారు. చాప కింద నీరులా బస్తీలో విస్తరిస్తున్న కరోనా అరికట్టడంలో విఫల మయ్యారనే చెప్పాలి. కొన్ని బస్తీల్లోకి పెట్రోలింగ్ సిబ్బంది వెళ్లడం లేదంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికైనా పోలీసులు పేద ప్రజలు నివసించే బస్తీలలో గట్టి నిఘా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పిస్తూ లాక్‌డౌన్‌ను విజయవంతం చేస్తూ కరోనా మహమ్మారిని తరిమికొట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

### ఇష్టానుసారంగా ఆటలు



రాష్ట్రవ్యాప్తంగా కరోనా కేసులు ఎక్కువవుతున్నాయి ఈ తరుణంలో ముఖ్యంగా ముసలవ్వ నియోజకవర్గంలో దాదాపు 10 కేసులు నమోదవుతున్నాయి. ఈ కారణంగా పకడ్బందీగా విధించిన పోలీసు వ్యవస్థ బస్తీలో ఆకతాయిలను మాత్రం అడ్డుకట్ట వేయలేకపోయింది. గుంపులు గుంపులుగా చేరి పేకాట అష్టాచమ్మా ఆడడం వల్ల కరోనా ఒకరి నుంచి ఒకరికి వ్యాపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనిపై పోలీసు సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపించి బస్తీలలో లాక్ డౌన్ నిబంధనలు కఠినతరం చేయాలని కోరుతున్నాం.

- స్థానికుడు భాస్కర్ ప్రజాపతి

## ఈ నెలకూ గత ఏడాది కరెంటు బిల్లులే!

### అనుమతించిన టీఎస్‌ఈఆర్సీ

**ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో**

ఏప్రిల్ నెల విద్యుత్ బిల్లులకు గత ఏడాది ఏప్రిల్ మాసానికి సంబంధించిన కరెంటు బిల్లులనే విద్యుత్ సంస్థలు పంపనున్నాయి. మార్చినెలకు సంబంధించిన కరెంటు మీటర్ రీడింగ్‌ను కరోనా లాక్‌డౌన్ నేపథ్యంలో తీయకుండా, గత ఏడాది (2019) మార్చినెలలో వాడిన కరెంటు వినియోగాన్నే తాత్కాలిక ప్రామాణికంగా తీసుకొని ఈనెలలో (ఏప్రిల్) బిల్లుల్ని పంపిణీ చేశారు. ఆ బిల్లులను కూడా వినియోగదారుల సెల్‌ఫోన్లకు మెసేజ్‌ల రూపంలో పంపిన విషయం తెలిసిందే. తాజాగా లాక్‌డౌన్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొడిగించిన నేపథ్యంలో ఏప్రిల్ నెల విద్యుత్ వినియోగానికి సంబంధించిన మీటర్ రీడింగ్‌ను తీయలేమనీ, దాని బదులు గత ఏడాది (2019) ఏప్రిల్ మాసంలోని కరెంటు వినియోగాన్నే మే నెలలో ఇచ్చే బిల్లుల్లో పంపుతామంటూ డిస్కంలు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్‌ఈఆర్సీ)కి దరఖాస్తు చేశాయి. ఈ నేపథ్యంలో ఆ విజ్ఞప్తికి అనుమతి ఇస్తూ సోమవారం టీఎస్‌ఈఆర్సీ ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది ఏప్రిల్ మాసం తర్వాత కరెంటు మీటర్లు తీసుకున్న వినియోగదారులకు ఎప్పుడు తీసుకుంటే ఆప్పటి బిల్లులు లేదా జారీ చేసిన చివరి బిల్లును నమూనా బిల్లుగా వచ్చే నెలలో పంపుతారు. లాక్‌డౌన్ ముగిసిన వెంటనే వాస్తవ మీటర్ రీడింగ్ ప్రకారం బిల్లుల్ని జారీ చేయాలనీ, కట్టిన బిల్లు మొత్తాల్లోని హెచ్చుతగ్గుల్ని సవరించాలనీ టీఎస్‌ఈఆర్సీ పేర్కొన్నది. అలాగే కరెంటు బిల్లుల్ని వినియోగదారులు ఆన్‌లైన్‌లో చెల్లించాలని డిస్కంల సీఎమ్‌డీలు విజ్ఞప్తి చేశారు.

## నర్సుల సమస్యలపై చర్చించాలి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నర్సుల సమస్యలపై చర్చించాలని నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎన్‌ఓఏ)డిమాండ్ చేసింది. సోమవారం నగరంలో ఎన్‌ఓఏ రాష్ట్ర అధ్యక్షులు శ్రీను రాథోడ్ అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయాలనీ, నర్సుల సమస్యల పరిష్కారానికి నర్సింగ్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని కోరింది. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలనీ, ప్రతి జిల్లాలో నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ ముఖ్య సలహాదారు చిలుపురి వీరచారి, డాక్టర్ రామ్ తిలక్, ఉపాధ్యక్షురాలు కవిత, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ రుఢావత్, కోశాధికారి వంశీ ప్రసాద్, జాయింట్ సెక్రటరీ జ్యోతి పాల్గొన్నారు.

# సారూ..! మమ్మల్ని పోనివ్వండి..

**సొంతూర్లకు పోతామంటూ టోలీచౌక్ వద్ద రోడ్డెక్కిన వలస కార్మికులు**

**బంజారాహిల్స్‌లోని 1000 మందిని పలు ప్రాంతాలకు తరలించిన పోలీసులు**

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**




తమ సొంత ఊళ్లకు పంపాలంటూ హైదరాబాద్‌లోని టోలీచౌకీ ప్రాంతంలో పెద్ద ఎత్తున వలస కార్మికులు రోడ్డెక్కారు. ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులు ఇక్కడ నిర్మాణ రంగంలో పనిచేస్తున్నారు. తమను వెంటనే తమ స్వస్థలాలకు పంపాలంటూ టోలిచౌకీలోని ఫ్లైఓవర్ కింద ఆదివారం వారు గుమికూడారు. సుమారు వెయ్యి మంది వలస కార్మికులు ఆ ప్రాంతాన్ని దిగ్బంధం చేసి ఆందోళన ఉధతం చేశారు. ఈ నెల 3న లాక్‌డౌన్ ముగుస్తుందని ఆశతో ఉన్న తమకు ప్రభుత్వం ఇంకో రెండు వారాలు పొడిగించటం వలన తాము దిక్కుతోచని స్థితిలో పడ్డామని వారు వాపోయారు. చేయడానికి పనిలేక, తినడానికి తిండిలేక విపత్కర పరిస్థితుల్లో ఉన్నామని ప్రభుత్వం వెంటనే తమను తమ స్వస్థలాలకు పంపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమాచారం తెలిసిన వెంటనే వెస్ట్ జోన్ డీసీపీ ఏ.ఆర్ శ్రీనివాస్ గోల్కొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి ఈ ప్రాంతాన్ని సందర్శించి వలస కార్మికులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తాము అన్ని విషయాలు చక్కబెడుతున్నామని వలస కార్మికులను వారి స్వస్థలాలకు పంపించడానికి వెంటనే తగిన చర్యలు తీసుకుంటున్నామని డీసీపీ శ్రీనివాస్ స్పష్టం చేయడంతో వలస కార్మికులు ఆందోళన విరమించారు.

**బంజారాహిల్స్ :** లాక్‌డౌన్ నేపథ్యంలో పనుల్లేక ఇక్కడే ఉంటున్న వలస కార్మికులకు కేంద్ర ప్రభుత్వం సడలింపు చేసిన నిబంధనల్లో భాగంగా తమ సొంత ప్రాంతాలకు వెళ్తామంటూ అధికారులను వేడుకుంటున్నారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని వెంకటేశ్వర కాలనీలో నిలసించే ఇతర రాష్ట్ర వలస కార్మికులు వందల సంఖ్యలో పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని తమ ధ్రువీకరణ పత్రాలను చూసి అనుమతిస్తే తమ ప్రాంతానికి వెళ్ళిపోతామంటూ అర్జీలు పెట్టుకుంటున్నారు. ఇటీవలె కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని తిరిగి తమ రాష్ట్రలకు పంపివేయాలని నిర్ణయం తీసుకోవడంతో బంజారాహిల్స్ పోలీసులకు వలస కూలీలు విజ్ఞాపనలు చేస్తున్నారు. అందులో భాగంగా బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇతర రాష్ట్రాలకు చెందిన 1000 మంది కూలీలు కాలినడకతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటే వారిని తిరిగి బంజారాహిల్స్ తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇచ్చి వారికి ఆహారం అందించినట్టు ఇన్‌స్పెక్టర్ కళింగరావు తెలిపారు. తమ ప్రాంతాలకు పంపాలని కేంద్ర నిర్ణయం తీసుకున్నా పంపడంతో జాప్యం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఇలా అడ్డుకోవడం కారణంగానే శుక్రవారం రాత్రి సిమెంటు మిక్సర్లో 18 మంది ప్రయాణించిన విషయాన్ని కార్మికులు గుర్తుచేశారు.ఇప్పటికైనా అధికారులు తమ బాధను అర్థం చేసుకుని తమను తమ ప్రాంతాలకు పంపించాలని కోరుతున్నారు.

**ఓయూ :** జార్ఖండ్‌కు చెందిన 25 కుటుంబాల వలస కూలీలు ఆదివారం మేడిపల్లి నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్తున్నారు. ఆయితే వారిని ఓయూ పోలీసులు తార్నాక చౌరస్తా వద్ద అడ్డుకుని వారికి అల్పాహారం అందించి వారిని అక్కడి నుంచి తిరిగి వెనక్కు పంపించారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డీఐ రమేష్‌నాయక్, ఎస్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## రూ.10 లక్షల కోట్ల ప్యాకేజీ ప్రకటించాలి

- కేంద్రానికి సీపీఐ నేతలు నారాయణ, చాడ డిమాండ్
- మఖ్దూంభవన్‌లో ఒకరోజు దీక్ష

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

కేంద్ర ప్రభుత్వం ప్రజలను ఆదుకునేందుకు రూ.10 లక్షల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని సీపీఐ డిమాండ్ చేసింది. రాష్ట్రాలకు ఆ సొమ్మును విడుదల చేయాలని కోరింది. పేదలను ఆదుకోవాలంటూ సోమవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో సీపీఐ నేతలు కె.నారాయణ, అజీజ్‌పాషా, చాడ వెంకటరెడ్డి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలస కూలీలు, అసంఘటిత కార్మికులు, వృత్తిదారులు, చిరుద్యోగులను ఆదుకునేందుకు కుటుంబానికి రూ.7 వేలు ఆర్థిక సహాయం, 20 కిలోల బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందికి రెండు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. గ్రీన్, ఆరెంజ్ జోన్లలో మద్యం అమ్మకాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని తప్పుపట్టారు. లాక్‌డౌన్ ఉన్నంతకాలం మద్యం అమ్మకాలను అనుమతి ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. ఎండను లెక్కచేయకుండా స్వస్థలాలకు కాలినడకన వెళ్తుంటే పోలీసులు లాఠీచార్జి చేయడం దుర్మార్గమని విమర్శించారు. 12 కిలోల బియ్యం, రూ.1,500 నగదుతో ముఖ్యమంత్రి, ప్రజాప్రతినిధులు నెలరోజులు జీవనం సాగిస్తారా? అని ప్రశ్నించారు. తాలు పేరుతో ధాన్యం కొనుగోలులో ఐదు కిలోల వరకు తరుగు తీయడం దారుణమని అన్నారు. పిడుగుపాటుకు చనిపోయిన కుటుంబాల వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. మఖ్దూంభవన్‌లో సీపీఐ నేతల దీక్షకు టీజేఎస్ అధ్యక్షులు కోదండరామ్, టీటీడీపీ అధ్యక్షులు ఎల్ రమణ సంఘీభావం ప్రకటించారు. సోమవారం దీక్షా శిబిరానికి చేరుకుని వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసంఘటిత కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వారిని ఆదుకుంటేనే దేశ ఆర్థిక వ్యవస్థ బాగుపడుతుందని చెప్పారు. రేషన్‌కార్డు లేని వారికీ 12 కిలోల బియ్యం, రూ.1,500 నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, ఎన్ బాలమల్లేష్, కార్యవర్గ సభ్యులు డి సుధాకర్‌తోపాటు ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

## ఎన్‌టిపిసి పనులు ప్రారంభం

**ప్రజాశక్తి- హైదరాబాద్‌బ్యూరో**

పెద్దపల్లి జిల్లాలో ఎన్టీపీసీ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ నిర్మాణ పనులకు అధికారులు అనుమతించారు. కేంద్రప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేస్తూ, సోమవారం నుంచే నిర్మాణ పనుల్ని పునఃప్రారంభిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం-2014 ప్రకారం కేంద్రప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా తొలివిడతలో ఇక్కడ 1,600 మెగావాట్ల వ్యవస్థాపక సామర్థ్యంతో ఈ ప్రాజెక్టను నిర్మిస్తున్నారు. కరోనా వైరస్ వ్యాప్తి, లాక్‌డౌన్ నేపథ్యంలో మార్చి 25 నుంచి ఇక్కడి నిర్మాణ పనుల్ని నిలిపివేశారు. ఈ నిర్మాణ పనుల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు పెద్దసంఖ్యలో పనిచేస్తున్నారు. లాక్‌డౌన్ పొడిగింపు నేపథ్యంలో వీరంతా స్వస్థలాలకు వెళ్లేందుకు సిద్ధపడటంతో ఎన్‌టిపిసి అభ్యర్ధన మేరకు పెద్దపల్లి జిల్లా యంత్రాంగం అత్యవసరంగా సమావేశమైంది. కలెక్టర్ శ్రీమతి సిక్తాపట్నాయక్ అధ్యక్షతన రామగుండం ఎమ్మెల్యే కె చందర్, రామగుండం పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ, ఎన్‌టిపిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్‌కుమార్‌తోపాటు రెవెన్యూ, పోలీస్, స్థానిక అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నిర్మాణ పనులకు కేంద్రప్రభుత్వం సడలింపులు ఇచ్చిన దృష్ట్యా ఎన్‌టిపిసి పనులు పునప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## ఎఫ్‌సీఐ గోదాముల్లోని బియ్యాన్ని పంచండి : డీజీ

- కాచిగూడ కృష్ణానగర్‌లో నిరుపేదలకు నిత్యావసరాలు
- ఎస్వీకే, టీపీఎస్‌కే సహాయంతో పంపిణీ

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ఎఫ్‌సీఐ గోదాముల్లో కుప్పలుగా పడి ఉన్న బియ్యం బస్తాలను ప్రజలందరికీ పంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింహారావు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని కాచిగూడ కృష్ణానగర్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రం, తెలంగాణ ప్రజాసాంస్కృతిక వేదిక సహకారంతో 120 మంది నిరుపేదలకు రూ.50 వేల విలువైన 10 రకాల నిత్యావసరాలతో కూడిన కిట్లను సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో ఒకపక్క కరోనా, మరోపక్క ఆకలి రక్కసి వెంటాడుతున్న సమయంలో నిత్యావసర సరుకుల పంపిణీ నిరుపేదల్లో మనోధైర్యాన్ని నింపిందన్నారు. నెల రోజులుగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం చేస్తున్న సేవలను వెలకట్టలేమనీ, ఆ ట్రస్టు ఆదర్శాలను కోట్ల రూపాయలిచ్చినా కొనలేమని అన్నారు. ముందస్తు ప్రణాళికలు లేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలతో దేశం పరిస్థితి చిన్నాభిన్నమైందని విమర్శించారు. కోట్లాది మంది ప్రజలు ఒక పక్క కరోనా వైరస్‌తో మరో పక్క ఆకలితో పోరాటం చేస్తున్నారని అన్నారు. ఎఫ్‌సీఐ గోదాముల్లో ఉన్న ఆహారధాన్యాలను ప్రజలందరికీ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) ఉద్యమాలు మాత్రమే కాదనీ, ఆపదలో ఉన్నవారికి ఆసరాగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) హైదరాబాద్ సిటీ సెంట్రల్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్, టీపీఎస్‌కే నాయకులు భూపతి వెంకటేశ్వర్లు, ఎస్వీకే నుంచి శంకర్ పాల్గొన్నారు.

## తగ్గుముఖం పట్టిన కరోనా

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

కరోనా కేసులు తగ్గుముఖం పట్టినట్టు వైద్యారోగ్యశాఖ వెల్లడించింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మార్చి 2న మొదటి కేసు నమోదు కాగా మరుసటి వారంలో ఒక్క పాజిటివ్ కేసూ రాలేదు. తిరిగి మార్చి 16 వరకు రెండు కేసులు, మార్చి 23 వరకు 30, మార్చి 30వ తేదీ వరకు 56 కేసులు నమోదయ్యాయి. ఏప్రిల్ మొదటి వారంలో అంటే ఆరవ తేదీ వరకు 303, రెండవ వారంలో 153, మూడవ వారంలో 366, నాలుగవ వారంలో 97 కేసులు నమోదయ్యాయి. కాగా ఈ వారం 76కు తగ్గాయి. సోమవారం కేవలం మూడు పాజిటివ్ కేసులు రాగా అవి కూడా జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉండటం గమనార్హం.

# ఆవిర్భావ దినోత్సవం దాకా ఆగాల్సిందే...

- లాక్‌డౌన్ ఎత్తివేతపై సర్కారు నిర్ణయం?
- అప్పటిదాకా అన్నీ బందే
- ఎపి పరిణామాల నేపథ్యంలో మద్యం ఊసే వద్దు
- కీలక రంగాల్లో కొన్నింటికే మినహాయింపులు
- నేడు చర్చించనున్న మంత్రివర్గం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో జనాలు రోడ్ల మీదికి రావాలంటే జూన్ రెండు వరకూ ఆగాల్సిందేనా..? అంటే అవుననే అంటున్నాయి ప్రభుత్వ వర్గాలు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఈనెల 17 వరకూ దేశవ్యాప్త లాక్‌డౌన్‌ను ప్రకటించింది. ఆ తర్వాత 24న రంజాన్ పండుగ ఉంది. ఈ నేపథ్యంలో కేంద్రం పొడిగించినా, పొడిగించకపోయినా రాష్ట్రంలో మాత్రం జూన్ ఒకటి వరకూ కఠిన ఆంక్షలతో కూడిన లాక్‌డౌన్ కొనసాగబోతున్నదని విశ్వసనీయ సమాచారం. ఆ నెల రెండో తేదీన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని.. కరోనా ఉధృతి, కేసుల తగ్గుదలను బట్టి లాక్‌డౌన్‌ను ఎత్తేసే అవకాశాలు కనబడుతున్నాయని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. ఇందుకు సంబంధించి మంగళవారం నిర్వహించబోయే మంత్రివర్గ సమావేశంలో చర్చించి, పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ముఖ్యమంత్రి కెసిఆర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో లాక్‌డౌన్ ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకూ నెలకొన్న పరిస్థితులు, ప్రపంచవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా కరోనా విజృంభణ, సరిహద్దు రాష్ట్రాల్లో కేసుల సంఖ్య, రాష్ట్రంలో పాజిటివ్ కేసులు తదితరాంశాలపై చర్చించనున్నారు. రోగులకు అందిస్తున్న చికిత్స, రెడ్ జోన్లలోని పరిస్థితి, లాక్‌డౌన్ అమలవుతున్న తీరు తెన్నులు, ఈ క్రమంలో ప్రజల సహకారం, ఉల్లంఘనలపై కూడా సీఎం సమాచారం అడిగి తెలుసుకోనున్నారు.

మరోవైపు లాక్‌డౌన్ సడలింపులు ఇచ్చిన తర్వాత ఢిల్లీ, ఏపీ, చండీగఢ్ తదితర రాష్ట్రాల్లో నెలకొన్న పరిణామాలపై కూడా క్యాబినెట్‌లో సమాలోచనలు చేయనున్నారు. ముఖ్యంగా పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో మద్యం దుకాణాలు తెరవటం, ఫలితంగా మందు బాబులు సామాజిక దూరం పాటించకుండా గుంపులుగా గూమికూడటం, ఎపిలోని సరిహద్దు పట్టణాలకు తెలంగాణ నుంచి కూడా మద్యం ప్రియులు వెళ్లటం తదితర పరిణామాలపై క్షుణ్నంగా చర్చించనున్నారు. ఆంధ్రాలో కొన్ని చోట్ల మందుబాబులను అదుపు చేయలేక పోలీసులు లాఠీఛార్జీ చేసిన సంగతి విదితమే. అందువల్ల జూన్ 2 వరకూ ఎట్టి పరిస్థితుల్లో వైన్ షాపులను తెరవొద్దనే నిర్ణయానికి సర్కారు వచ్చినట్టు సమాచారం. రాష్ట్రానికి హైదరాబాదే అతిపెద్ద ఆదాయ వనరు. కానీ నగరంతోపాటు చుట్టుపక్కల జిల్లాలైన రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి కూడా రెడ్ జోన్‌లోనే ఉన్నాయి. అందువల్ల ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ జిల్లాల్లో సడలింపులు ఇచ్చే అవకాశమే లేదు. ఆదాయమొచ్చే హైదరాబాద్‌లోనే ఆంక్షలు ఎత్తేయనప్పుడు... మిగతా జిల్లాల్లో వాటిని సడలించి ఏం లాభమన్న అభిప్రాయం సర్కారు పెద్దల్లో నెలకొన్నది. అందువల్ల జూన్ ఒకటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగే అవకాశాలే ఎక్కువగా కనబడుతున్నాయి.

దీంతోపాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రజలకు ఇస్తున్న ఆర్థిక సహాయాలు, బియ్యం పంపిణీ, వలస కూలీల సమస్యలు, వారి తరలింపు, వైద్యులు, పోలీసులు, పారిశుధ్య కార్మికులు, ఇతర అత్యవసర సేవలందించే సిబ్బందికి ప్రోత్సాహకాలు కూడా క్యాబినెట్‌లో చర్చకు రానున్నాయి. ముఖ్యంగా నిర్మాణ రంగం కుదేలవటంతో ప్రభుత్వం దానికి జీవం పోసేందుకు తీవ్రంగా ఆలోచిస్తున్నది. ఈ క్రమంలోనే తాజాగా సీఎస్ సోమేశ్‌కుమార్ క్రెడాయ్, ట్రెడాయ్, ఇతర డెవలపర్లతో ప్రత్యేకంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిర్మాణ రంగ కూలీలకు అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. తద్వారా వారి సంక్షేమానికి పాటుపడాలని కాంట్రాక్టర్లు, బిల్డర్లను కోరారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టులు, రోడ్లు, భవనాలు, ఇతర నిర్మాణాలు కొనసాగించేందుకు సర్కారు అన్ని రకాల చర్యలూ తీసుకోనున్నది. వీటితోపాటు పంటల కొనుగోళ్లు, వడగండ్ల వానలు, రైతుల ఇబ్బందులు, బత్తాయి పండ్లకు మార్కెట్ సౌకర్యాలు కల్పించటం తదితరాంశాలపై చర్చించనున్నారు. క్యాబినెట్ అనంతరం సీఎం స్వయంగా వివరాలను మీడియాకు వెల్లడించనున్నారని సమాచారం.

# వంట సరుకుకు చిక్కులు

- సరుకుల కోసం ప్రతియేటా ధర్మాబాద్‌కు పయనం
- ఈ యేడాది మహారాష్ట్రలో కరోనా విజృంభన
- మిర్చి, మసాలాలకు ఇబ్బందులు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**



కరోనా మహమ్మారి నేపథ్యంలో నిత్యావసర సరుకులకు ఇబ్బందులు తప్పేలా లేదు. నెలన్నరగా అన్ని రంగాలూ మూతపడటంతో సరుకులు నిండుకున్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వాసులు దశాబ్దాలుగా వంట సామగ్రి కోసం మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు పోతున్నారు. ఏప్రిల్-మే నెలల మధ్యలో మిర్చి, మసాలాల కోసం నిజామాబాద్ నగరంతో పాటు పలు గ్రామాల నుంచి వేలాది మంది జనం అక్కడికి వెళ్లి సంవత్సరానికి సరిపడా సరుకులు తెచ్చుకునేవారు. స్థానిక మార్కెట్ ధరలతో పోల్చితే అక్కడ తక్కువగా ఉండటంతో పాటు నాణ్యమైన సరుకులు లభిస్తాయని నమ్మకం. కానీ, ఈ యేడాది మహారాష్ట్రలో కరోనా విజృంభిస్తోంది. ఇప్పటికే ఆ రాష్ట్రంలో 12,974 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. లాక్‌డౌన్ ప్రకటించిన నాటి నుంచి నిజామాబాద్-మహారాష్ట్ర సరిహద్దును అధికారులు మూసేశారు. దీంతో కరోనా ప్రభావం ప్రస్తుతం వంటింటిపై పడింది. నిజామాబాద్ జిల్లావాసులు ప్రతియేటా వేసవి కాలంలో మిర్చి, చింతపండు తదితర వస్తువులను మహారాష్ట్రలోని ధర్మాబాద్ నుంచి తెచ్చుకుంటారు. జీలకర్ర, ఆవాలు, గరం మసాల ముడి పదార్థాలను కూడా అక్కడి నుంచే తెస్తారు. నిజామాబాద్ పట్టణానికి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఈ పట్టణం ఉంది. ప్రతిరోజూ నిజామాబాద్ గుండా నడిచే సుమారు 14 రైళ్లు ఈ ప్రాంతంలో ఆగుతాయి. చాలా మంది ఉదయం 9 నుంచి 10 గంటలకు వరకు ధర్మాబాద్‌కు వెళ్లి మిర్చి, పసుపును కొని అక్కడే ఎండబెట్టి గిర్నీ పట్టించుకుని యేడాదికి సరిపడా సరుకులతో సాయంత్రం వరకు ఇంటికి చేరుకుంటారు. కానీ ఈ యేడాది లాక్‌డౌన్ వల్ల.. అక్కడికి వెళ్లే పరిస్థితి లేక స్థానికంగా కిలో మిర్చికి సగటున రూ.100 ఎక్కువ పెట్టి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. గతేడాది ధర్మాబాద్ మార్కెట్‌లో కిలో మిర్చి రూ.120 నుంచి రూ.130 పలికింది. ప్రస్తుతం నిజామాబాద్‌లో కిలో మిర్చి రూ.200 నుంచి రూ.250 పలుకుతోంది. నిజామాబాద్ ప్రధాన మార్కెట్‌లో రూ.200కు కిలో అమ్ముతుండగా.. గ్రామాలకు వెళ్లి అమ్మే వ్యాపారులు రూ.250 తీసుకుంటున్నారు.

### ఎండు మిర్చి మస్తు రేటు

ప్రతి ఎండకాలం మిర్చి కోసం మహారాష్ట్రలోని ధర్మాబాద్ వెళ్లి కారం పొడి చేయించుకుని తెచ్చుకునేవాళ్లం. ఇక్కడికంటే అగ్గువకే ఉండేది. గతేడాది రూ.120కే కిలో ఎండు మిర్చిని కొని కారం తెచ్చుకున్నాం. ఈసారి లాక్‌డౌన్‌తో ధర్మాబాద్ వెళ్లలేదు. ఇక్కడే కిలో రూ.240కు ఎండుమిర్చి కొన్నాం.

**సరోజన- నందిపేట్ మండలం**

## జూన్ 15 నుంచి డిగ్రీ పరీక్షలు



- తొలుత చివరి సంవత్సరం విద్యార్థులకు
- పరీక్షా సమయం 2 గంటలే
- ఉన్నత విద్యామండలి చైర్మెన్ పాపిరెడ్డి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో జూన్ 15 నుంచి డిగ్రీ పరీక్షలు నిర్వహించనున్నట్టు ఉన్నత విద్యామండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి చెప్పారు. ఈ మేరకు విశ్వవిద్యాలయాల వారీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. సోమవారం శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రయివేటు కాలేజీల యాజమాన్యాలతో ఆన్‌లైన్‌లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా నేపథ్యంలో విద్యార్థులు విద్యాసంవత్సరం నష్టపోకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రత్యేక పరిస్థితుల కారణంగా పరీక్షా సమయాన్ని మూడు గంటల నుంచి రెండు గంటలకు కుదించామని వివరించారు. విడతల వారీగా పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు. ప్రశ్నాపత్రం నమూనాను మార్చడం వంటి ప్రక్రియతో విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా చూస్తామన్నారు. భౌతికదూరం పాటింపజేసేందుకు ముందుగా ఆప్షనల్ సబ్జెక్టులు ఆ తర్వాత లాంగ్వేజ్ సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. డిటెన్షన్ విధానాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. వచ్చే విద్యాసంవత్సరానికి కొత్త కోర్సుల కోసం దరఖాస్తు చేసుకున్న సంస్థల విషయంలో ప్రత్యేక నిబంధనలు అనుసరించి మంజూరు చేస్తామన్నారు. ఈసారి తనిఖీలతో నిమిత్తం లేకుండా వర్సిటీలు అనుబంధ గుర్తింపును ఇస్తాయని వివరించారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్, దోస్త్ కన్వీనర్ ఆర్.లింబాద్రి మాట్లాడుతూ డిగ్రీ ప్రవేశాల విషయంలో పలు మార్పులు చేశామన్నారు. రెండు, మూడు దశల్లోనే ప్రవేశాలు పూర్తి చేస్తామని చెప్పారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా డాటా సైన్స్ లాంటి అధునాతన కోర్సులను ప్రవేశపెడుతున్నామని వివరించారు. ఆన్‌లైన్ తరగతుల నిర్వహణకు కళాశాలలు సిద్ధం కావాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రయివేటు డిగ్రీ, పీజీ కాలేజీ యాజమాన్యాల సంఘం అధ్యక్షులు ఎస్‌వీసీ ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఎ పరమేశ్వర్, నాయకులు రామకృష్ణ, వేణు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణ రంగంపై కరోనా పంజా

- లాక్‌డౌన్ ముగిసినా ఆర్నెళ్లు అంతే!
- అభివృద్ధిపై తీవ్ర ప్రభావం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**



కరోనా దెబ్బకు నిర్మాణరంగం కుదేలైంది. ఆర్నెళ్లుగా రాష్ట్రంలో భవన నిర్మాణ రంగంలో పెద్ద ఎత్తున స్తబ్ధత ఏర్పడింది. డిమాండ్‌కు మించి నిర్మాణాలు జరగడం, ఆశించిన స్థాయిలో అమ్మకాలు లేక విలవిల్లాడుతున్న తరుణంలో గోరుచుట్టపై రోకలి పోటులా కరోనా పంజా విసిరింది. భవన నిర్మాణరంగమే కాకుండా ప్రభుత్వ, ప్రయివేటు రంగంలో అనేక ప్రాజెక్టులు ఆగిపోయాయి. దీనికి తోడు ఈ రంగంలో పని చేస్తున్న లక్షలాది మంది వలస కార్మికులు కరోనా భయంతో తమ స్వస్థలాలకు వెళ్లడంతో మరో ఆర్నెళ్ల వరకు రాష్ట్రంలో అశించిన వృద్ధిని అందుకోలేదని నిపుణులు అంటున్నారు.

నిర్మాణరంగంలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 20 లక్షల మంది కార్మికులున్నారు. ఇందులో 8 లక్షల మంది వరకు బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, ఒడిశా, పశ్చిమబెంగాల్, చత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు చెందిన వారే. ఇటుక బట్టీలు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, సీలింగ్ వర్కర్లు, మేస్త్రీలు, మార్బుల్, గ్రానైట్, టైల్స్ తదితర రంగాల్లో పని చేస్తున్నారు. పెద్ద పెద్ద కంపెనీలు, ప్రభుత్వ, ప్రయివేటు రంగంలో నడుస్తున్న ప్రాజెక్టులు తమ నిర్మాణాలను ఆపడంతో వీరంతా రెండు నెలలుగా పనులు లేక, తిండిలేక అష్టకష్టాలు పడుతున్నారు. దీంతో గత్యంతరం లేక ఇప్పటికే కొంత మంది కాలి నడకన స్వగ్రామాలకు వెళ్లారు. తాజాగా కేంద్రం వారిని స్వస్థలాలకు వెళ్లేందుకు అనుమతించడం, ప్రత్యేక రైళ్లను నడుపుతుండడంతో రాష్ట్రంలో పని చేస్తున్న వలస కార్మికులు ఒక్కరు కూడా ఉండే పరిస్థితిలేదు. డబ్బులు రేపు సంపాదించుకోవచ్చు బతికుంటే బలిసాకు తినొచ్చని అనుమతిచ్చిందే తడవుగా కార్మికులు సొంతూర్లకు పయనమవుతున్నారు. ఈ ప్రభావం తెలంగాణ నిర్మాణ రంగంపై రాబోయే ఆర్నెళ్ల వరకు ఉంటుందని భావిస్తున్నారు. రాజస్థాన్‌కు చెందిన వారు మార్బుల్, గ్రానైట్, టైల్స్ వేయడం, ఒడిశాకు చెందిన వారు ఇటుక బట్టీలు, రైస్ మిల్లుల్లో ఇలా తాము చేస్తున్న పనుల్లో ప్రత్యేకమైన నైపుణ్యం కల్గినవారు కావడం గమనార్హం. లాక్‌డౌన్ ఎత్తివేసి పనులు ప్రారంభమైనా వీరి లోటును కచ్చితంగా కనిపించనుందని భావిస్తున్నారు..

### సహాయం అందించడంతో విఫలం

లాక్‌డౌన్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వారి గురించి పెద్దగా పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. తెల్ల రేషన్ కార్డుదారులతో పాటు వలస కార్మికులందరికి 12 కిలోల ఉచిత బియ్యం, కుటుంబానికి రూ.500 చెల్లింపు ఆచరణలో విఫలమైంది. రాష్ట్రంలో కేవలం 40 శాతం మందికి కూడా అందలేని తెలుస్తున్నది. అలాగే వీరుంటున్న ప్రాంతాలు, ప్రత్యేక క్యాంపుల్లో అన్ని సహాయక చర్యలు చేపట్టాలని చివరికి హైకోర్టు సైతం ఆదేశించింది. అయినా వలస కార్మికుల సౌకర్యాలపై ప్రభుత్వం పెద్దగా పట్టించుకోక పోవడం గమనార్హం. ప్రాంతం గాని ప్రాంతం నుంచి కట్టుబట్టలతో వలస వచ్చి ఇక్కడి అభివృద్ధిలో తాము భాగస్వామ్యమైతే విపత్కర పరిస్థితుల్లో సర్కార్ తమను పట్టించుకోలేదనే భావన వారిలో నాటుకుపోయింది. దాంతో ఇప్పడిప్పుడే తిరిగి రాకపోవచ్చుని భావిస్తున్నారు.

### కేంద్రం వైఫల్యం

వలస కార్మికులను ఆదుకోడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దేశంలో దాదాపు 14 కోట్ల మంది కార్మికులు వివిధ వృత్తుల్లో అనేక రాష్ట్రాలకు వలస పోతుంటారు. వలస కార్మికులను తమ స్వస్థలాలకు పంపించడం, లేదా ఉన్న చోటే అన్ని సౌకర్యాలు కల్పించడం చేసిన తర్వాతే లాక్‌డౌన్ నిర్ణయం తీసుకోకుండా ఉన్న పళంగా ప్రకటించడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గతంలో ఇదే నిర్లక్ష్యంతో నోట్ల రద్దు చేసి దేశ ఆర్థిక వ్యవస్థను మోడీ సర్కార్ నాశనం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం సైతం వారిని ఆదుకోవడంలో శ్రద్ధ చూపలేదు. వారికి ప్రకటించిన ప్యాకేజీ కేవలం కొంత మందికి మాత్రమే అందింది. లాక్‌డౌన్ ముగిసిన తర్వాత కూడా తెలంగాణలో వారి లోటు నిర్మాణరంగంపై కచ్చితంగా ఉంటుంది.

**రత్నాకరం కోటంరాజు,**
**టీఎస్ బీసీడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి (సీఐటీయూ)**